# పారిశుధ్య సేవలకు అంతరాయం లేకుండా చర్యలు

- నిర్వహణ కేంద్రాలను పరిశీలించిన జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి.వెంకన్న
- సి&డి ప్లాంట్ పనులు వేగవంతం చేయాలని ఆదేశం

**వరంగల్, ఆయుధం:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న శుక్రవారం నగరంలోని వివిధ వ్యర్థాల నిర్వహణ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్వహణ తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా బాలసముద్రంలోని పారిశుధ్య వాహనాల మరమ్మతుల షెడ్, వరంగల్ పోతననగర్‌లోని సెకండరీ ట్రాన్స్‌ఫర్ స్టేషన్, బయోగ్యాస్ మిథనైజేషన్ ప్లాంట్, పైడిపల్లిలో ఏర్పాటు చేస్తున్న కన్‌స్ట్రక్షన్ అండ్ డెమాలిషన్ (సి&డి) ప్లాంట్, అమ్మవారిపేటలోని వ్యర్థాల నిర్వహణ కేంద్రంతో పాటు ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎఫ్ఎస్‌టీపీ)ను



సందర్శించి పరిశీలించారు. బాలసముద్రంలోని పారిశుధ్య వాహనాల మరమ్మతుల షెడ్‌లో వాహనాల మరమ్మతు పనులను పరిశీలించిన కమిషనర్, మరమ్మతుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య వాహనాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు, పారిశుధ్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం సెకండరీ ట్రాన్స్‌ఫర్ స్టేషన్, బయోగ్యాస్-మిథనైజేషన్ ప్లాంట్, వ్యర్థాల నిర్వహణ కేంద్రం, ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్వహణ, పరిశుభ్రత, యంత్రాల పనితీరును పరిశీలించి, అన్ని కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పరిశుభ్రత ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. పైడిపల్లిలో నిర్మాణంలో ఉన్న కన్‌స్ట్రక్షన్ అండ్ డెమాలిషన్ (సి&డి) ప్లాంట్ పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఈఈ మహేందర్ తో పాటు జీడబ్ల్యూఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.





## కలెక్టర్, సీపీని కలిసిన బల్దియా కమిషనర్

**వరంగల్, ఆయుధం:**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్ టి.వెంకన్న శుక్రవారం వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదను వరంగల్ కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారద కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రేటర్ వరంగల్ నగర అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, మౌలిక సదుపాయాల మెరుగుదల, ప్రజలకు నాణ్యమైన మున్సిపల్ సేవల అందజేత తదితర అంశాలపై ఇరువురు చర్చించారు.

### సీపీ ని కలిసిన బల్దియా కమిషనర్

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్ టి. వెంకన్న వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత ను శుక్రవారం హన్మకొండలోని పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు .ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ జిడబ్ల్యూఎంసి కమిషనర్ కు శుభాకాంక్షలు తెలిపారు.



## పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహం

(మొదటి పేజీ తరువాయి..)

సూచించారు.

నాణ్యతతో కూడిన వస్త్రాలను తయారు చేసి ప్రముఖ వస్త్ర విక్రయ సంస్థలు, రిటైల్ చైన్లతో అనుసంధానం చేసుకోవడం ద్వారా మార్కెట్‌ను విస్తరించడంతో పాటు అధిక ఆదాయం పొందవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

### గ్రానైట్ పరిశ్రమను పరిశీలించిన కలెక్టర్

మడికొండ ఇండస్ట్రియల్ పార్కులోని గ్రానైట్ పరిశ్రమను జిల్లా కలెక్టర్ సందర్శించి ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు. గృహ నిర్మాణ రంగంలో గ్రానైట్, మార్బుల్ ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా ఆధునిక సాంకేతికతతో నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేయడం అభినందనీయమని పారిశ్రామికవేత్తలను ప్రశంసించారు.

### ఐటీ సెజ్‌ను సందర్శించిన కలెక్టర్

అనంతరం ఐటీ సెజ్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్ అక్కడ పనిచేస్తున్న యువత, ఉపాధి అవకాశాలు, నిర్వహణ విధానంపై వివరాలు తెలుసుకున్నారు. బ్యాంకు లింకేజీ రుణాల ద్వారా పరిశ్రమలు స్థాపించిన పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, ప్రోత్సాహకాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పరిశ్రమల అభివృద్ధితో పాటు స్థానిక యువతకు మరింత ఉపాధి కల్పించే దిశగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ స్వామి నాయక్, కాజీపేట తహసీల్దార్ రాజు, పలువురు పారిశ్రామికవేత్తలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## వ్యాపార సంస్థలు ఫైర్ సేఫ్టీ నిబంధనలు కచ్చితంగా పాటించాలి

- బల్దియా కమిషనర్ టి.వెంకన్న

**వరంగల్, ఆయుధం:** నగరంలోని వ్యాపార సంస్థలు (కమర్షియల్ నిర్మాణాలు) ఫైర్ సేఫ్టీ నిబంధనలు కచ్చితంగా పాటించాలని బల్దియా కమిషనర్ టి.వెంకన్న పేర్కొన్నారు. శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో డిఆర్ఎఫ్, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ ఉన్నతాధికారులతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో కమిషనర్ పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డి ఆర్ ఎఫ్ అధికారులు ప్రతి నెల కచ్చితంగా పీరియాడికల్ తనిఖీలు చేపట్టాలని, నగరంలోని కమర్షియల్, రెసిడెన్షియల్ వాసులు ఫైర్ సేఫ్టీ నిబంధనలను పాటించి రక్షణ పరికరాలు ఏర్పాటు చేసుకునేలా వారికి నోటీసులు అందజేసి స్నేహపూర్వక వాతావరణం లో అవగాహన కల్పించాలని, నగర వ్యాప్తంగా ఫుట్ పాత్ లపై వ్యాపారాలు నిర్వహించకుండా అవగాహన కల్పించాలని, నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ వారి సహకారం తో తొలగించాలని, ప్రభుత్వ కార్యాలయాల పై అతికించిన వివిధ రకాల పోస్టర్ లను శానిటేషన్ సిబ్బంది సహకారం తో తొలగించాలని, భారీ వర్షాల నేపథ్యం లో సమాచారం లో జాప్యాన్ని నివారించడానికి ఇంజనీరింగ్ టౌన్ ప్లానింగ్ డి ఆర్ ఎఫ్ అధికారులకు వాకీ టాకీ లను అందజేయడం జరుగుతుందని, డి ఆర్ ఎఫ్ సిబ్బందికి అవసరమైన సామగ్రిని వసతులను కల్పించడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు. నగరంలో భవన నిర్మాణాలకు అనుసరిస్తున్న విధి విధానాలను, నిర్మాణ క్రమంలో పాటించాల్సిన ఫైర్ సేఫ్టీ నిబంధనలను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. అక్రమ నిర్మాణాల కూల్చివేతల తీరును సిటీ ప్లానర్ ను అడిగి తెలుసుకున్నారు. డీఆర్ఎఫ్ కంట్రోల్ రూం ను ఐసిసిసి కేంద్రం లో ఉండేలా ఏర్పాటు చేసి ఐసిసిసి నియంత్రణలో పని చేసేలా చూడాలని, డిఆర్ఎఫ్ అధికారులు ప్రతి రోజు ఐఎండి వారు అందించే వాతావరణ సమాచారాన్ని తెలుసుకుంటూ అందుకు సన్నద్ధంగా ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ రాజ్ కుమార్, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిఎఫ్ఓ శంకర్ లింగం, ఎస్ఎఫ్ఓ రాజేశ్వర్ రావు, సీనియర్ అసిస్టెంట్ విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చడమే ప్రభుత్వ లక్ష్యం

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

**పరకాల, ఆయుధం:** నియోజకవర్గంలోని ప్రతీ గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పరకాల మండలం పోచారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో పోచారం, నాగారం గ్రామాలలో నిర్మించిన అంగన్వాడీ భవనాలు, నాగారం, లక్ష్మీపురం, హైబోద్ పల్లి గ్రామాలలో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. అనంతరం అంగన్వాడీ చిన్నారులకు అక్షరాభ్యాసం, స్కూల్ యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. సంక్షేమ కార్యక్రమాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలనలో గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి, పార్టీలకు అతీతంగా ప్రతీ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం అన్నారు.



కోటి మంది మహిళలను కోటీశ్వర్లు చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారు అని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మోసపోయిన గృహ లక్ష్మి బాధితులకు ఇండ్లను మంజూరు చేస్తామని అన్నారు. మహిళల ఆర్థిక అభివృద్ధికి దామెరలో పరకాల ఇందిరా మహిళా డైరీని ఏర్పాటు చేస్తున్నామని, దీని ద్వారా పాల విప్లవం తీసుకురాబోతున్నామని అన్నారు. త్వరలో పాల సేకరణ ప్రారంభం చేస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా,వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. చిన్నారులకు సురక్షితమైన,సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యతో పాటు పోషకాహార సేవలు అందించేందుకు ఆధునిక సౌకర్యాలతో అంగన్వాడీ భవనాలను నిర్మిస్తున్నామని తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణ యందు విద్యార్థులతో కలసి మొక్కలను నాటారు.

## విద్యతో పాటు క్రమశిక్షణ, పరిశుభ్రతకు సమ ప్రాధాన్యం

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

**హనుమకొండ, ఆయుధం:** విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, పాఠశాల పరిసరాల పరిశుభ్రత అలవర్చేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మడికొండలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం అమలు, భోజనశాల, తాగునీటి సౌకర్యాలు, తరగతి గదులు, వసతి గృహాలు, మరుగుదొడ్లు, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. భోజనశాలలో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్న తీరును, ఆహార నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం డైనింగ్ హాల్, తరగతి గదులు, మరుగుదొడ్లలో పారిశుధ్య లోపాలను గమనించి సంబంధిత అధికారులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మరుగుదొడ్లలో నిరంతరం నీరు వృథాగా ప్రవహించడం, దుర్వాసన వెదజల్లడం, పరిశుభ్రత లేకపోవడం వంటి అంశాలను తీవ్రంగా పరిగణించిన కలెక్టర్, బాధ్యులైన సిబ్బందిపై వెంటనే చర్యలు తీసుకోవాలని



అధికారులను ఆదేశించారు.

పారిశుధ్య లోపాల వల్ల విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉందని పేర్కొన్న కలెక్టర్, పాఠశాల ఆవరణ, తరగతి గదులు, భోజనశాల, వసతి గృహాలు, మరుగుదొడ్లు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పారిశుధ్య నిర్వహణకు అవసరమైన సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించడంతో పాటు తాత్కాలిక సిబ్బంది పనితీరుపై నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని, పరిశుభ్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ఈ తనిఖీలో జిల్లా ప్లానింగ్ అధికారి, కాజీపేట తహసీల్దార్ రాజు, ప్రిన్సిపాల్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ రాజ్యంలో పేదల ఇండ్ల కూల్చివేతలా?

- పేదలు గూడు కోసం ఉద్యమించేది కమ్యూనిస్టులే
- గుండ్ల సింగారం వంటా వార్పులో పాల్గొన్న చాడ, తక్కళ్ళపల్లి

**హనుమకొండ, ఆయుధం:** పేదలకు ఇందిరమ్మ రాజ్యం తెస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి రాగానే వారి గూడును కూల్చివేయడం దుర్మార్గమని, ఇందిరమ్మ రాజ్యం అంటే పేదల ఇండ్ల కూల్చివేతలేనా అని సీపీఐ జాతీయ మాజీ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం హనుమకొండ జిల్లా పరిధిలోని గుండ్ల సింగారంలోని సురవరం సుధాకర్ రెడ్డి నగర్ లో ఇండ్ల కూల్చివేత జరిగిన విశ్రమించకుండా ఇండ్ల స్థలాలు, గూడు కోసం పేదలు చేపట్టిన భూపోరాటంలో వంటా వార్పు కార్యక్రమానికి సీపీఐ జాతీయ మాజీ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు హాజరై సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి, తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ దశాబ్దాలుగా పేదలకు భూములు, గృహ వసతి కోసం కమ్యూనిస్టులే నిరంతరం పోరాడుతున్నారని గుర్తుచేశారు. నిరుపేదలు ఎంతో ఆశతో కాంగ్రెస్‌కు ఓట్లేసి గెలిపిస్తే, నేడు వారి ఇండ్లను కూల్చి రోడ్డున పడేయడం హేయమైన చర్య అని మండిపడ్డారు. నిరుపేదలు నిర్మించుకున్న ఇండ్ల కూల్చివేతలను ప్రభుత్వం తక్షణమే నిలిపివేయాలని అన్నారు. హనుమకొండ గుండ్ల సింగారంలో సర్వే నెంబర్లు 174, 175లలో నేడు చెరువు శిఖం భూమి లేనే లేదని, గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో పేదలకు 1360 మందికి ఇంటి స్థలాలు ఇచ్చారని అన్నారు. గత ఐదేళ్ళుగా అక్కడ పేదలు సిపిఐ ఆధ్వర్యంలో భూపోరాటం నిర్వహించి గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారని అన్నారు. గుండ్ల సింగారంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇండ్ల స్థలాలు కేటాయించి, పట్టాలు ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వం మొండివైఖరి వీడకపోతే కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా భూపోరాటాలను తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ



జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యురాలు మంద సదాలక్ష్మి, ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, సిపిఐ హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు వుట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, బత్తిని సదానందం, బిక్షపతి, గాదె మొగిలి, జన్ను కృష్ణ, నాయకులు శంకర్ నాయక్, రాజేందర్, రాము గోపాల్ చారి, అమృతయ్య, దామోదర్, నరేందర్, ప్రసాద్, ప్రశాంత్, మంగ, సంధ్య, మమత, రజిత, భూపోరాట కమిటీ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## జూపల్లి, హరీశ్‌రావు మధ్య మాటల యుద్ధం

(మొదటి పేజీ తరువాయి..)

బీఆర్ఎస్ తీసుకున్న రుణాలు రూ.4.17 లక్షల కోట్లు మాత్రమే. నేను చెప్పిన లెక్కలకు కట్టుబడి ఉంటానని.. చర్చకు సిద్ధమని చెప్పాను'' అని హరీశ్‌రావు అన్నారు.

హరీశ్‌రావు లేఖపై మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందిస్తూ మీడియా సమావేశం నిర్వహించారు. ''నేను చెప్పిన లెక్కలకు కట్టుబడి ఉన్నా. తప్పని నిరూపిస్తే రాజీనామా చేస్తా. వందలాది మంది త్యాగాలు చేస్తే తెలంగాణ వచ్చింది. పవిత్ర ఉద్యమాన్ని కేసీఆర్ కుటుంబం స్వార్థానికి వాడుకుంది. నేను అడిగింది తప్పు.. హరీశ్‌రావు లేఖలో ఏదేదో రాశారు. ఆయనది పలాయనవాదం. అబద్ధాలు చెబుతూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. నేను చెప్పే లెక్కలు తప్పు అని కేసీఆర్‌తో చెప్పించాలి. అసెంబ్లీకి కేసీఆర్ ఎందుకు రావట్లేదు? అప్పులపై ఆయన ఎందుకు మాట్లాడటం లేదు?బీఆర్ఎస్ చేసిన అప్పులపై ఈ ప్రభుత్వం నెలకు రూ.6వేల కోట్ల వడ్డీ చెల్లిస్తోంది''అని జూపల్లి అన్నారు.

## అప్పులు చేసింది మీరు కాదా?

(మొదటి పేజీ తరువాయి..)

మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సింగరేణిపై బీఆర్ఎస్ నేతలు అబద్ధాలను ప్రచారం చేస్తున్నారన్నారు. సింగరేణి కోల్ బ్లాక్‌లను పెంచేందుకు చిన్న ప్రయత్నమైనా చేశారా అని భట్టి ప్రశ్నించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అప్పులను కేటీఆర్, హరీశ్‌రావులు తక్కువ చేసి చూపేందుకు ప్రయత్నిస్తున్నారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మండిపడ్డారు. హరీశ్‌రావు మంత్రిగా చేశాననే విషయం మర్చిపోయి అనేక విషయాలపై అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు సోషల్ మీడియా ద్వారా అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారన్నారు. వారు చెప్పే అబద్ధాలు ప్రజల్లోకి వెళ్లకూడదన్నారు. నిశ్శబ్దంగా ఉంటే వ్యవస్థలకు నష్టం చేసిన వాళ్లమవుతామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అబద్ధాల పునాదులపై పదేళ్లపాటు పాలన చేశారన్నారు.




## బంగారానికి మళ్లీ రెక్కలు

- ₹1.50 లక్షల పైకి..

**ఢిల్లీ, ఆయుధం:** బంగారం ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. తగ్గినట్లే తగ్గిన పసిడి ధర అమాంతం పెరిగిపోయింది. అంతర్జాతీయ ధరలను అనుసరించి మళ్లీ రూ.1.50 లక్షల స్థాయికి చేరుకుంది. 10 గ్రాముల మేలిమి పసిడి ధర ఒక్కరోజులోనే రూ.3300 మేర పెరిగింది. అటు వెండి సైతం కిలో రూ.5వేలు పెరిగి రూ.2.45 లక్షలకు చేరుకుంది. దేశ రాజధాని ఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల పసిడి ధర గురువారం రూ.1,47,500గా ఉండగా.. నేడు రూ.1,50,800కి చేరింది. వెండి రూ.2.40 లక్షల నుంచి రూ.2.45 లక్షలకు పెరిగింది. అంతర్జాతీయంగా పసిడి ధర ఔన్సు ఒక్కరోజులో 57 డాలర్లు పెరిగి 4,181 డాలర్లకు చేరుకోగా.. వెండి ఔన్సు 2.44 శాతం పెరిగి 62.45 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

బంగారం, వెండి ధరలు ఇటీవల దిద్దుబాటుకు గురయ్యాయి. గరిష్ఠాల నుంచి దాదాపు 10 శాతం మేర పతనమయ్యాయి. దీంతో వీటి ధరలు మరింత పడతాయన్న అంచనాలతో చాలా మంది తమ వద్ద ఉన్న బంగారాన్ని సైతం విక్రయించారు. అయితే, అంతర్జాతీయంగా చోటుచేసుకున్న పరిణామాలు పసిడికి మళ్లీ డిమాండ్ కల్పించాయి. అమెరికాలో వడ్డీ రేట్లు పెంపుపై ఉన్న భయాలు పోవడం, డాలరు విలువ తగ్గుముఖం పట్టడం ఇందుకు కారణమని నిపుణులు పేర్కొంటున్నారు. అమెరికాలో తాజాగా వెలువడిన నాన్ ఫామ్ పేరోల్ డేటా అంచనాల కంటే తక్కువగా నమోదు కాగా... ద్రవ్యోల్బణం తగ్గుముఖం పడుతోందంటూ ఫెడ్ ఛైర్మన్ కెవిన్ వార్ష్ ఇచ్చిన సంకేతాలు వడ్డీ రేట్ల పెంపు భయాలను పోగొట్టాయి. దీంతో బంగారం ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. అయితే, జులై 8న రాబోయే ఫెడ్ మినిట్స్ బంగారం ధరలను దిశా నిర్దేశం చేసే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



## ఇన్‌స్టాగ్రామ్‌కు కేంద్రం నోటీసులు!

**ఢిల్లీ, ఆయుధం:**

ఇన్‌స్టాగ్రామ్‌కు కేంద్ర ప్రభుత్వం నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. చిన్నారులపై లైంగిక వేధింపులను ప్రోత్సహించేలా ఉన్న ప్రకటనలు, సైబర్ మోసాల ముప్పు దృష్ట్యా కేంద్రం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. వివాదాస్పద ప్రకటనలపై వివరణ ఇవ్వాలని మెటా (Meta)ను కేంద్ర ఐటీ శాఖ ఆదేశించినట్లు వార్తలు వస్తున్నాయి. ఒకే వారంలో మెటాకు వరుసగా రెండుసార్లు కేంద్రం హెచ్చరికలు జారీ చేయడం గమనార్హం. వాట్సప్‌లోని యూజర్‌నేమ్ ఫీచర్ విషయంలో మెటాకు కేంద్ర ప్రభుత్వం బుధవారం నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ ఫీచర్ వల్ల ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు, నకిలీ గుర్తింపులతో ప్రజలను మోసం చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై మూడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని సూచించింది.

అప్పటివరకు భారత పౌరులకు యూజర్‌నేమ్ ఫీచర్ రోల్‌అవుట్‌ను ఆపాలని సూచించింది. ఈ వ్యవహారంలో సంప్రదింపులు పూర్తయ్యాకనే ఈ అంశంపై ముందుకెళ్లాలని నోటీసుల్లో పేర్కొంది. కాగా, చిన్నారులపై లైంగిక వేధింపులను (CSAM) ప్రోత్సహించేలా ఉన్న ఇన్‌స్టాగ్రామ్ ప్రకటనల విషయంలో మెటా (Meta)కు నోటీసులు జారీ చేయాలని కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ (Ashwini Vaishnaw) తాజాగా అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ ప్లాట్‌ఫామ్‌పై అటువంటి ప్రకటనలు ఎందుకు చేయాల్సి వచ్చిందో అధికారులు మెటాను వివరణ కోరే అవకాశం ఉంది.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695